క్లుప్తంగా

31న ఆలయ ప్రతిష్టా వేడుకలు



శావల్యాపురం: మండలంలోని చినకంచర్లలో సూమారు రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి దేవాలయం ధ్వజస్తంభ, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయాలు ప్రతిష్టా మహోత్సవాలు ఈనెల 31వ తేదీ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. తిరుపతి వేదపండితులు ఆగమ సిద్ధాంతి శ్రీపతి అనంతచార్యుల సారథ్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి పూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 30న గ్రామంలో బోడ్రాయి(నాభిశిల), గమిడి రాళ్ల ప్రతిష్టా వేడుకలు జరుగుతాయన్నారు. భారీ అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చర్మకార సేవా సంఘం అధ్యక్షుడిగా జుంజు యేహోను



శావల్యాపురం: మండల చర్మకార సేవా సంఘం అధ్యక్షుడిగా జుంజు యేహోను నియమితులయ్యారు. మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన యేహోను గతంలో ఈపూరు వ్యవసాయ మార్కెటు యార్డు మాజీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. నియమాక పత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నుంచి అందుకున్నట్లు చెప్పారు. చర్మకారుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

చేతి రాత మెరుగు పరుచుకోవాలి



వినుకొండ టౌన్: విద్యార్థులు చేతి రాతను మెరుగు పరుచుకోవాలని ఉపాధ్యాయుడు ప్రభాకర్ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం చేతి రాతపై అవగాహన కల్పించారు. జనరల్ నాలెడ్జ్‌పై ఉపాధ్యాయుడు నిఖిల్, తెలుగు అంశాలపై ఈవీ రమణరెడ్డి బోధించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి భూక్యా బద్రినాయక్ పర్యవేక్షించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



నూజెండ్ల: మండలంలోని జంగాలపల్లి, త్రిపురాపురం, తలార్లపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ జిలానీబాషా మంగళవారం తనిఖీ చేశారు. కూలీల మస్టర్, పని ప్రదేశాల్లో నీడ వసతిని పరిశీలించి కూలీలకు వేసవి కాలంలో అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ కట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



వినుకొండ(నూజెండ్ల): విత్తనాలను డీలర్లు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ రవిబాబు హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి, మిరప, ఇతర విత్తనాలను కొనుగోలు లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు విత్తనాలను విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడు విత్తనాల కంపెనీ పేర్లు, బ్యాచ్ నంబరు, అమ్మిన ధర బిల్లుపైన రాసి రైతు సంతకం చేయించాలని, బిల్లు రైతులకు ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అనధికారికంగా విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేటి నుంచి తూబాడులో రీసర్వే

నాదెండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పనులు మండలంలోని తూబాడు గ్రామంలో బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రైతులు హాజరై పొలాల గట్లు, విస్తీర్ణాన్ని రికార్డుల రూపంలో చూపాలన్నారు. సమస్యలున్నట్లయితే వీఆర్వోల వద్ద పరిష్కరించుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు డ్రోన్ ఫ్లై సర్వే పనులు ప్రారంభమవుతాయని, గ్రామంలో సంబంధిత రైతులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి గోళ్లమూడి కాశయ్య, ఎంపీపీ తలతోటి రాణి, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, టీజే రత్తయ్య పాల్గొన్నారు.

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- బొప్పూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజలపై అపారమైన ప్రేమ, విధేయత కలిగి ఉండి, ప్రజల సంతోషమే తన లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించటంతో పాటు వారి సమస్యలు మంత్రి రజిని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలనతో ముందడుగు వేస్తున్నదని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని చెప్పారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల కష్టాలు తెలుసునని, వారికి ఏం కావాలో తెలిసిన నేత ఆయన అని చెప్పారు. పేదలకు రూ.లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో అందించిన ప్రభుత్వం తమదన్నారు. ప్రభుత్వం ఏ పథకం ద్వారా ప్రజలకు ఎంత మేలు చేసిందో వివరించటానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఎంతో సానుకూలత వ్యక్తం అవుతోందని చెప్పారు. దీనికి నిదర్శనం మళ్లీమళ్లీ జగనన్నకే ఓటేస్తామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలకు తోడు నాడు- నేడు పథకం ద్వారా ఆసుపత్రుల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల బలోపేతం వంటి అభివృద్ధి కార్యక్రమాలు గణనీయంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. జగనన్న కాలనీల నిర్మాణంతో ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంత మంచి ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా సాంబయ్య, గుత్తా యాములయ్య, అమీర్‌జాని, అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్ ధరఖాస్తు పత్రాలను విడుదల చేస్తున్న మిట్టపల్లి తదితరులు

నరసరావుపేట ఈస్ట్: పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందివ్వటం అభినందనీయమని జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ తెలిపారు. శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఊరా చరిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఊరా భాస్కరరావు ఆర్థిక సహకారంతో అందించనున్న స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు పత్రాలను మంగళవారం మిట్టపల్లి రమేష్ తన కార్యాలయంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండే భాస్కరరావు నూతనంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి 108 మంది విద్యార్థులకు దాదాపు రూ.3లక్షలు స్కాలర్‌షిప్‌లుగా అందచేయటం అభినందనీయమని తెలిపారు. శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందేందుకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 3వతేదీ లోగా అందివ్వాలని కోరారు. వివరాలకు 92464553348, 9182753404, 9885422058 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఊరా ట్రస్ట్ చైర్మన్ ఊరా భాస్కరరావు, కొత్తూరి ప్రసాదరావు, తాడువాయి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీఈటీలకు పదోన్నతికి అవకాశం కల్పించాలి



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పీఈటీ అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పీఈటీలకు ఉద్యోగోన్నతి కల్పించాలని డీఈఓకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2018 డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన పి.ఈ.టీలకు 2023 ఎస్.ఎ.పి.ఈ (పి.డి) పదోన్నతులకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పల్నాడు జిల్లా పి.ఈ.టీ, ఎస్.ఎ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఖాదర్‌మస్తాన్, బి.స్వర్ణరాజు మాట్లాడుతూ, పదోన్నతులు పొందేందుకు నిబంధనల ప్రకారం రెండు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేయాల్సిఉండగా, మిగిలిన సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కంటే తాము కేవలం 21 రోజులు వెనుకబడి ఉన్నామన్నారు. కోర్టు కేసుల కారణంగా తాము ఆలస్యంగా విధుల్లో చేరినట్లు చెప్పారు. తమను కూడా మిగిలిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో సమానంగా పరిగణించి పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించారు. ఇప్పటికే అర్హత ఉన్న పీఈటీలు లేక పి.డి. పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అలాగే పీఈటీగా కొనసాగుతూ డిగ్రీ అర్హత ఉన్న వారికి బీపీఈడీ కోర్సు చేసేందుకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులతో పసుపులేటి సురేష్

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు క్రీడాకారుల ప్రతిభ చూపారు. తెనాలి నారాయణ కళాశాలలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 19 నుంచి మే 21 వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన 9 మంది క్రీడాకారులు 4 బంగారు పథకాలను, 3 వెండి, ఒక బ్రాంజ్ పథకాన్ని కైవసం చేసుకుని పల్నాడు జిల్లా ప్రతిష్టలు చాటారు. సబ్ జూనియర్ విభాగం...53 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన జి.ఎస్.వి.ప్రణీత్ వెండి పతకం, 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.కార్తీక్ రజిత పతకం, 59కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎండీ రఫీ వెండి పతకం,66 కేజీల్లో సత్తెనపల్లికి చెందిన షేక్ కరిం గోల్డ్ మెడల్, 66కేజీలో సత్తెనపల్లికి చెందిన షేఖ మోహిద్దీన్ వెండి పతకం కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగం .. 53 కేజీల విభాగంలో రొంపిచేర్ల కు చెందిన ఎం అనుష బంగారు పతకం,66 కేజీల విభాగంలో వెన్నాదేవీకి చెందిన ఎస్ శరత్ 4వ స్థానం, 83 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన టీ.సాయి 5వ స్థానం, 120 కేజీల విభాగంలో గుడిపూడి కు చెందిన లింగిశెట్టి శివ నాగేశ్వర రావు 2 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్ శిక్షణలో మెళకువలు నేర్చుకొని ప్రతిభ చాటామని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సాధిస్తామని ఆత్మ విశ్వాసంతో క్రీడాకారులు ప్రకటించారు. సురేష్ ఉత్తమ శిక్షణ, ప్రోత్సాహాలను అందించడం వల్ల పల్నాడు జిల్లాలో పథకాలు సాధిస్తూ మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచామన్నారు.ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు కోచ్ పసుపులేటి సురేష్‌ను అభినందించారు.కోచ్ సురేష్‌ను, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ ఆనంద్, ఎస్ మణిరత్నం, టీ.శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు క్రీడాకారులను అభినందించారు.

నేడు యడ్లపాడు మండల ప్రజాపరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.హనుమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ పిడతల రూబీ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారుల విధిగా హాజరు కావాలన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పి.సీ తారామయ్య మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 15 గ్రామపంచాయతీల్లో రోజుకు 3310 మంది కూలీలు వివిధ రకాల పనులు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు మండల ప్రాథమిక వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

25, 26 తేదీల్లో కౌలు హక్కుల వేలం

యడ్లపాడు: మండలంలోని ఆరు గ్రామాల్లోని పలు దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన వ్యవసాయ భూములకు కౌలు హక్కుల బహిరంగ వేలం 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏడాది కౌలుసాగు చేసుకునేందుకు ఆసక్తి కలవారు రూ.5వేల ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలను వేలం పాట నిర్వహణ సమయంలో తెలుసుకోవాలని సూచించారు. 25వ తేదీన దింతెనపాడు శ్రీదండేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12.16 ఎకరాలు, శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 12.63 ఎకరాలు, యడ్లపాడు శ్రీరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12.66 ఎకరాలు, రణవీరాంజనేయస్వామి ఆలయానికి చెందిన 2.58, అద్దంకి నాంచారమ్మ ఆలయానికి చెందిన 1.91 ఎకరాలు, కంద్రిక విశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన 11.39 ఎకరాలు, జగ్గాపురం- శ్రీవేణుగోపాలస్వామి 9.42, చంద్రశేఖరస్వామి ఆలయం 5.70 ఎకరాలకు వేలం ఉంటుందని చెప్పారు. అదే విధంగా 26వ తేదీ మధ్యాహ్నం ఉన్నవ శ్రీరాజగోపాలస్వామి ఆలయ భూమి ఎకరం, శ్రీమూలస్థానేశ్వరస్వామి ఆలయం 4.42, చెంఘీజ్‌ఖాన్‌పేట- వెన్నముద్దల గోపాలకృష్ణస్వామి ఆలయానికి చెందిన 3.77, సొలస శ్రీభూసమేత రంగనాయస్వామి ఆలయానికి చెందిన 8.81 ఎకరాలు, ఊరంకమ్మ అమ్మవారు ఆలయానికి చెందిన 5.99 ఎకరాల భూములు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

వేసవి శిక్షణ.. విజ్ఞానార్జన

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులకు ఈ వేసవి సరదాలను పంచుతోంది. ఒకప్పటి రోజుల్లో అయితే అమ్మమ్మ వాళ్ల ఇళ్లకు వెళ్లే వారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆటవిడుపు కార్యక్రమమే లేదు. దొరికిందల్లా ఒక్కటే సెల్‌ఫోన్. అందులో ఒక్కసారి తలదూర్చితే మళ్లీ ఎప్పటికి తేరుకుంటారో తెలియని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులకు ఆసక్తిని కలిగించేలా గ్రంథాలయాలు వేసవి శిబిరాలకు శ్రీకారం చుట్టాయి. వారికి పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగించడంతో పాటు, పలు రకాల అంశాలను వివరిస్తూ శిబిరంలో విద్యార్థులు ఉల్లాసంగా ఆస్వాదించేలా కార్యక్రమాలను చేపడుతున్నారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులంతా ఇళ్ల వద్దనే ఉంటున్నారు. వారికి పుస్తక పఠనంపై ఆసక్తిని కల్గించడంతో పాటు .. విజ్ఞానాన్ని పెంపొందించు కునేలా గ్రంథాలయాలు వేదికగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- గ్రంథాలయాల్లో చిన్నారుల సందడి
- పుస్తక పఠనం, విభిన్న కార్యక్రమాలు
- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


సత్తెనపల్లి: ఏడాది పొడవునా పాఠశాలల్లో తరగతి గదులకే పరిమితమైన చిన్నారులకు వేసవి సెలవులే ఆటవిడుపు. వీటిని చాలా మంది చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ .. ఆట పాటలతో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాల్లో తమ ప్రతిభకు పదును పెట్టుకుంటున్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న ప్రారంభమైన శిబిరాలు జూన్ 11 వరకు కొనసాగనున్నాయి. భవిష్య పాఠశాలలో ఐఐటీ ఫిజిక్స్ అధ్యాపకుడు బండారు అంకమ్మరావు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ విద్యార్థులకు పలు అంశాల పై తర్ఫీదు ఇస్తున్నారు.



పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ గ్రంథాలయంలో శిక్షణ శిబిరంలో విద్యార్థులు

ఏఏ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారంటే ...

- కథలు వినడం, చదవడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం.



పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ గ్రంథాలయంలో పుస్తకాలు

- భగవద్గీత శ్లోకాలు, ఆంగ్లపదాలకు అర్థాలు చెప్పడం, పొడుపు కథలు, గ్రంథాలయా ల్లో పుస్తకాలు చదివించడం.
- చరిత్ర పుస్తకాలు చదివించడం, ఇండోర్ గేమ్స్, యోగా, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక అంశాల్లో తర్ఫీదు.
- ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నా



గ్రంథాలయాల్లో చదువుకుని పలువురు ఉన్నత స్థాయికి ఎదిగారని తెలుసుకున్నా. గతంలో గ్రంథాలయాలకు రాలేదు. వేసవి శిబిరాల నేపథ్యంలో పలు అంశాలపై పట్టు సాధిస్తున్నా. ఇక్కడ వేల పుస్తకాలు ఉన్నాయి. చదవడానికి మంచి వాతావరణం ఉంది. కొత్త విషయాలు తెలుసుకుంటున్నా.

-ఎస్.హేమంత్, విద్యార్థి, సత్తెనపల్లి

సమయం వృథా కాకుండా



వేసవి శిక్షణ శిబిరాలతో సమయం వృథా కావడం లేదు. ఉదయం నిర్ణీత వేళకు లైబ్రరీకి రావడం, వెళ్లడం అలవాటైంది. పఠనాసక్తి, విజ్ఞానాన్ని పెంచుకోవడం, వ్యాయామానికి ఉపకరిస్తోంది. అధ్యాపకుడు వచ్చి పలు సూచనలు చేస్తున్నారు. వివిధ విజ్ఞాన అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణకు స్పందన పెరిగింది

-ఎస్ ఆథ్యా, విద్యార్థిని, సత్తెనపల్లి

వేసవి శిక్షణకు మంచి స్పందన



ప్రభుత్వం అమలుచేస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి స్థానిక గ్రంథాలయంలో స్పందన ఉంది. విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతుండగా, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. ప్రభుత్వం తరపున తాగునీరు, పుస్తకాలు వంటి వసతులు పూర్తి స్థాయిలో కల్పించారు. రిసోర్స్ పర్సన్ పుస్తక పఠనం పై శిక్షణ ఇస్తున్నారు.

-కె.వాణి, లైబ్రరీయన్, సత్తెనపల్లి

పిల్లల్లోని ఆసక్తిని గమనించి..



వేసవి శిబిరాలు పిల్లల్లోని మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతగానో దోహద పడతాయి. పిల్లల్లోని ఆసక్తిని గమనించి శిక్షణ అందిస్తున్నాం. దీని వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు పెరగడంతో గెలుపోటములను సమా నంగా స్వీకరించేతత్వం అలవడుతుంది.

– బండారు అంకమ్మరావు
రిసోర్స్‌పర్సన్, సత్తెనపల్లి

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు



నాదెండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022-23 సంవత్సరానికి 15వ విడత సామాజిక ప్రజావేదిక తనిఖీలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఏపీఓ పుష్పరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలతో కో ఆర్డినేషన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 2023-23లో అన్ని పంచాయతీల్లో రూ.6,61,22,169 పనులు జరిగాయన్నారు. ఒక ఎస్ఆర్‌పీ, 8 మంది డీఆర్‌పీలతో ప్రతి గ్రామంలో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ జాకీర్‌హుసేన్, ఎస్ఆర్‌పీ ఎం.బుజ్జి పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



నరసరావుపేట: పదోవార్డు గ్రామ సచివాలయం వలంటీర్లను మంగళవారం సన్మానించారు. కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, బీఎస్ రామకృష్ణంరాజు హాజరయ్యారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు కుల, మతం, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ అందుతున్నాయంటే అదీ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల కృషి ఫలితమే అన్నారు. వార్డు పరిధిలోని వలంటీర్లను సన్మానించారు.

2న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నరసరావుపేట: అరుణాచలంలో జూన్ నాలుగో తేదీ నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు జూన్ 2వ తేదీ రాత్రి 10 గంటలకు బయలుదేరి మూడో తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ దర్శించుకుంటూ నాలుగో తేదీ ఉదయం నాలుగు గంటలకు అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. భక్తులందరూ గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకొని అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం బయలుదేరి ఐదో తేదీ ఉదయం ఐదు గంటలకు నరసరావుపేట చేరుకుంటుందని వివరించారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ వెల ఒక్కొక్కరికి రూ.2550 అన్నారు. వివరాలకోసం 73828 96041, 73828 96038, 99592 25428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



రొంపిచర్ల: పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో విప్పర్లపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఎండేటి లక్ష్మీనారాయణ(37) ఈ నెల 18వ తేదీన పొలంలో కూలీ పనులు చేస్తుండగా కుడి కాలు మీద పాము కాటు వేయటం వలన అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే పొలంలో ఉన్న తోటి కూలీలు అతడిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌లో చేర్చారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

26న వినుకొండలో జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 26వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. నరసరావుపేటలోని ఆయన స్వగృహంలో జాబ్‌మేళా పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి మేళా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహిస్తుందని వివరించారు. ప్రతిఒక్క నిరుద్యోగి జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు.